మురుగు సమస్యను పరిష్కరించండి

కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి



సింగరేణి కాలనీలో డ్రైనేజీ ఓవర్ ఫ్లోను పరిశీలిస్తున్న జంగం శ్వేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్: డ్రైనేజీలు నిండిపోయి రహదారులపై మురుగునీరు పారుతుందని వెంటనే సమస్యను పరిష్కరించాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి వాటర్‌వర్క్స్ అధికారులకు కోరారు. డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్, ఎస్‌ఎస్‌రెడ్డి కాలనీల్లో డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయని స్థానికులు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం కార్పొరేటర్ వాటర్‌వర్క్స్ అధికారులతో కలసి ఆయా కాలనీల్లో పర్యటించి కాలనీల్లో సమస్యగా మారిన డ్రైనేజీలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారులపై నిత్యం మురుగు పారుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. రహదారులపై నడిచి వెళ్లేందుకు కూడా కష్టంగా ఉందని, దుర్వాసన అపరిశుభ్రతతో ఇక్కట్లు పడుతున్నామని వారు వాపోయారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ సింగరేణి కాలనీ ఎస్‌ఎస్‌రెడ్డి కాలనీల్లో సమస్యగా మారిన డ్రైనేజీల వద్ద వెంటనే మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచించారు. ఆయా డ్రైనేజీల్లో పూడిక తీయించి మురుగునీరు రహదారులపై పారకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రైనేజీ సమస్య పరిష్కారమయ్యాక రెండు కాలనీల్లో మళ్లీ పర్యటిస్తానని కార్పొరేటర్ స్థానికులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ డీజీఎం సరిత, మేనేజర్ రమ్య, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా భావించాలి

మూసారాంబాగ్ కార్పొరేటర్ బి. భాగ్యలక్ష్మి



విద్యార్థులతో కలసి మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షణ చేయాలని మూసారాంబాగ్ కార్పొరేటర్ బి. భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కార్పొరేటర్ ఫ్రెండ్స్ కాలనీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'అమ్మ పేరుతో ఒక మొక్క' (ఏక్ పేడ్ మా కే నామ్) అనే నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా తీసుకోవాలన్నారు. భవిష్యత్ తరాల కోసం మొక్కలు విరివిరిగా నాటి పెంచి పెద్ద చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, రాముయాదవ్, కొంగర ప్రవీణ్, ఉదయ్, మల్లేష్, సంతోష్, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, యూబీడీ సూపర్‌వైజర్ కృష్ణ పాల్గొన్నారు.

అభయ హస్తానికి జోరుగా దరఖాస్తులు

చాదర్‌ఘాట్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయ హస్తం పథకంలో భాగంగా మలక్‌పేట సర్కిల్–6 కార్యాలయంలో సబ్సిడీ మీద గ్యాస్, ఉచిత కరెంట్‌కు లబ్ధిపొందే అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ జోరుగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా డీసీ జయంత్ మాట్లాడుతూ గతంలో దరఖాస్తు చేసుకోనివారు, ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాని వారు మళ్లీ కార్యాలయానికి వచ్చి అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా కొత్త దరఖాస్తుల స్వీకరణ కూడా డేటా ఎంట్రీలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు దాదాపు ఆరు వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తులు పరిశీలించి లబ్ధిదారులకు పథకం వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



సర్కిల్ కార్యాలయంలో గ్యాస్, కరెంట్ అప్లికేషన్లు తీసుకుంటున్న అధికారులు

చంపాపేటలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలీ పర్యటన



చంపాపేటలోని మినీ ఫంక్షన్ హాల్‌ను పరిశీలిస్తున్న ఆమ్రపాలీ

చంపాపేట: పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలీ ఆదేశించారు. గురువారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌తో కలసి ఆమె శుక్రవారం చంపాపేట డివిజన్‌లో పర్యటించి పెండింగ్ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. రెడ్డిబస్తీ కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులతో పూర్తి అయిన మినీ ఫంక్షన్ హాల్, సుల్తానా అల్వా కాలనీలో అసంపూర్తి దశలో ఉన్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను పరిశీలించిన అనంతరం ఆమె వనస్థలిపురంలోని సుష్మా హాకీ స్టేడియాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డీసీ జాకియా సుల్తానా, ఇతర సర్కిల్ అధికారులు పాల్గొన్నారు.

ఫతుల్లాగూడ చెరువును కాపాడాలని తహసీల్దార్‌కు వినతి

నాగోలు: కబ్జాదారుల నుంచి ఫతుల్లాగూడ చెరువును కాపాడాలని ఉప్పల్ తహసీల్దార్ వాణిరెడ్డికి ఫతుల్లాగూడ గ్రామస్తులు శుక్రవారం కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నాగోలు డివిజన్‌లోని ఫతుల్లాగూడ చెరువును కొంత మంది రాత్రి సమయంలో చెరువులో మట్టిని నింపుతూ కబ్జా చేస్తున్నారని తెలిపారు. చెరువును మట్టితో పూడ్చి నకిలీ పత్రాలు సృష్టించి ప్లాట్లుగా మార్చుతూ అడిగిన వారిని ఏదో ఒకరకంగా మభ్యపెడుతూ కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. అడ్డుకున్న వారిపై దాడులకు సైతం పాల్పడుతున్నారని తెలిపారు. దీనిపై రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడడం లేదని వారు పేర్కొన్నారు. చెరువుకు సమీపంలో 125 సర్వే నంబర్‌కు ఆనుకొని ఉండడంతో 125 /ఇ, 125/ఈ సర్వే నెంబర్లను సృష్టిస్తూ నకిలీ ధ్రువ పత్రాలను తయారు చేసి కబ్జాకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు చేపట్టి కబ్జాదారుల నుంచి ఫతుల్లాగూడ చెరువును కాపాడాలని గ్రామస్తులు తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కాటేపాక జంగయ్య, యాదయ్య, కిషన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ తహసీల్దార్ వాణిరెడ్డి వినతిపత్రం అందజేస్తున్న ఫతుల్లాగూడ గ్రామస్తులు

బ్రాహ్మణుల సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపాలి



ముఖ్యమంత్రి, ఐ.టీ. శాఖ మంత్రికి పోస్ట్ కార్డ్సులు పోస్ట్ చేస్తున్న మహిళలు

దిల్‌సుఖ్‌నగర్: బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని తెలంగాణ బ్రాహ్మణ స్త్రీ శక్తి సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రికి సమస్యలను పోస్ట్ కార్డ్సుల ద్వారా పోస్ట్ చేశారు. శుక్రవారం ఆర్‌కేపురంలో ఏర్పాటు కార్యక్రమంలో చేసిన తెలంగాణ బ్రాహ్మణ సంఘం ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు, తెలంగాణ బ్రాహ్మణ స్త్రీ శక్తి వ్యవస్థాపక అధ్యక్షులు తాడికొండ అనురాధలు మాట్లాడుతూ బ్రాహ్మణులకు విదేశీ విద్యా రుణాలు, ఉన్నత చదువుల కోసం వెళ్లిన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. అదే విధంగా బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ప్రభుత్వం వెంటనే పరిష్కారం చూపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శక్తి సభ్యులు వి.రాజేశ్వరి, ప్రత్యూష హరి, జె. శ్రీలక్ష్మి, కె.సీతాకుమారి, డి.అరుణ, ఎం. సత్యవతి, జె.కళ్యాణి ఎస్.రాధిక, కె.రాజలక్ష్మి, సి.శిరీష, ఎ. మాధవాయి, వి.శ్రీలత, ఎ. సారిక, శ్రావణి, రుక్మిణి పాల్గొన్నారు.

ముంపు ప్రాంతంలో పర్యటించిన కమిషనర్

బోడుప్పల్: 17వ డివిజన్ పరిధిలోని మారుతీనగర్‌లో ముంపు ప్రాంతాన్ని శుక్రవారం కమిషనర్ రాంలింగం, డీఈ బాలమురళి, స్థానిక కార్పొరేటర్ పోగుల నర్సింహారెడ్డి పర్యటించారు. ముంపు ప్రాంతాన్ని పరిశీలించి స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్య తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రాంలింగం మాట్లాడుతూ రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సత్వర చర్యలు చేపడతామన్నారు. మారుతీనగర్, మణికంఠ కాలనీ, శివపురి ఫేస్ 2, రాంరెడ్డి కాలనీలు ముంపు ప్రాంతంలో ఉన్నాయని, వాటికి నిధులు కేటాయించి భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో మారుతీనగర్ కాలనీ అధ్యక్షులు అంజయ్యయాదవ్, మాజీ అధ్యక్షులు సత్యశీలారెడ్డి, కాలనీవాసులు రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నివారణ మార్గాలే రక్షణ చర్యలు

- మలేరియా, డెంగీ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన
- అవగాహన శిబిరంలో చీఫ్ ఎంటమాలజిస్ట్ డా.రాంబాబు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు

కాచిగూడ : దోమల రహిత నగరం కోసం అందరం కలిసి పోరాడుదామని జీహెచ్‌ఎంసీ చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు పిలుపునిచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నారాయణగూడలోని మాడపాటి హనుమంతరావు బాలికల హైస్కూల్‌లో దోమల నివారణపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ సమేతంగా మన ఇళ్లు, పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమల నుంచి రక్షణ పొందాలని సూచించారు. దోమలను నివారించి మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధుల నుంచి మనల్ని మనమే కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

దోమల నియంత్రణకు జాగ్రత్తలు..

- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- ఇంటి లోపల, పైన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు మూతలు బిగించి ఉంచుకోవాలి. రబ్బరు టైర్లు, పాత వస్తువులు, ప్లాస్టిక్, పాలిథిన్ వస్తువుల్లో నీటిని నిల్వ లేకుండా చూడాలి. వీటిని దోమలకు ఆవాసయోగం కాకుండా తొలగించాలి.
- పిచ్చి మొక్కలు ఎక్కువ ఉంటే దోమల సంతాన ఉత్పత్తికి కేంద్రాలుగా మారతాయి. వీటికి బదులు ఇళ్లలో తులసి, పుదీనా, సిట్రోనెల్లాగ్రాస్, లెమన్‌గ్రాస్ వంటి మొక్కలను కుండీల్లో పెంచుకోవడం వల్ల దోమలను చాలా వరకు నియంత్రించవచ్చు.
- ఇంటి పరిసరాలల్లో మురికి నీటిని నిల్వలేకుండా చూసుకోవాలి. ఇంటి నుంచి బయటకు వెళ్లే నీరు పూర్తిస్థాయిలో డ్రైనేజీ, ఇంకుడు గుంతల్లోకి వెళ్లేలా ఏర్పాట్లు చేయాలి.
- నీటి నిల్వకు దారితీసే చిన్నచిన్న పూడికలు, గుంతలను మూసివేయాలి.

దోమల నివారణపై అవగాహన..

దోమల నివారణపై జరిగిన అవగాహన శిబిరంలో విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవగాహన పెంచుకున్నారు. జీహెచ్‌ఎంసీ చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు, స్కూల్ ప్రిన్సిపాల్ విజితా, ఈఎఫ్‌ఏ నరేందర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌ర్ రెడ్డి, డీపీఓ శ్రీనివాస్, సిస్టర్ రమా, ఆశావర్కర్లు, ఎంటమాలజీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా అశోక్ కుమార్



మలక్‌పేట: మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా అశోక్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. అశోక్‌కుమార్ మహబూబ్‌నగర్ సీసీఎస్ నుంచి బదిలీపై మలక్‌పేటకు వచ్చారు. ఇక్కడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన నాగం చంద్రశేఖర్ మల్టీజోన్–2కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

రోడ్డు పనులు చేపట్టండి

బోడుప్పల్: మారుతీనగర్‌లో రోడ్డు పనులు చేట్టాలంటూ ఆకాలనీ వాసులు కమిషనర్ రాంలింగంకు వినతి పత్రం అందజేశారు. రోడ్డు వేయడాన్ని పక్క కాలనీవాసులు అడ్డు చెబుతున్నారని, వారితో మాట్లాడి తమ కాలనీ రోడ్డుకు పరిష్కారం చూపాలని వినతి పత్రంలో కోరారు. కమిషనర్ స్పందించి డీఈని పంపి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు వెల్లడించారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీ ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రుద్ర యాగ మహోత్సవ వేడుకలు

బోడుప్పల్: లక్ష్మినగర్ (హుడా)కాలనీలోని లక్ష్మిగణపతి దేవాలయంలో శనివారం నుంచి శత చండీ శత రుద్ర యాగ మహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు వెల్లడించారు. ఈనెల 6 నుంచి 14వ తేదీ వరకు వారాహి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నవాహ్నిక దీక్ష, శత చండీ, శత రుద్రయాగం, చండీ పారాయణ, రుద్రాభిషేకం, మూల మంత్రహోమాలు, మంత్ర పుష్పం, మహా పూర్ణాహుతి, యాగ భస్మ ధారణ, దీక్ష విరమణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ఆక్రమణలు తొలగింపు

రామంతాపూర్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి కేసీఆర్‌నగర్ సర్వీస్ రోడ్డులో ఇరువైపులా రోడ్డును ఆక్రమించుకుని ఫుట్‌పాత్‌లపై ఉన్న షెడ్లను, డబ్బాలను శుక్రవారం టౌన్ ప్లానింగ్ అధికారి సురేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య సిబ్బంది తొలగించారు. పాదచారులకు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్న ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించడంతో హర్షం వ్యక్తం చేశారు.

పోటెత్తిన భక్తజనం

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమాలోని శ్మశాన కాళికామాత ఆలయానికి అమావాస్య సందర్భంగా భక్తజన తాకిడి కొనసాగింది. కోరిన కోరికలు తీరుతుండడంతో గత కొన్ని సంవత్సరాలుగా ఈ ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. అమ్మవారి మహాత్మ్యాన్ని సామాజిక మాధ్యమాల తెలుసుకున్న రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆది, మంగళ, శుక్ర వారాలలో తరలివస్తున్నారు. తాజాగా శుక్రవారం ఆషాఢ మాసం అమవాస్య కావడంతో భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏకంగా ఫలక్‌నుమా రైల్వే బ్రిడ్జి ప్రారంభం నుంచి మొదలుకొని ఆలయం వరకు భక్తులు క్యూలైన్లలో నిలబడ్డారు. సరైన సదుపాయాలు, పర్యవేక్షణ లేకపోవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పలేదు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి సంరక్షణ

బాధితుడికి లక్ష రూపాయల ఎల్‌ఓసీని అందజేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



బాధిత కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: సీఎం సహాయ నిధి పేదల ఆరోగ్య సంరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ పరిధి సాయిభవానీనగర్‌కాలనీకి చెందిన శివకుమార్ కొంత కాలం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రంగా గాయాలై నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో హాస్పిటల్ వైద్యులు శస్త్రచికిత్స చేయాలని చెప్పడంతో ఆర్థిక పరిస్థితి బాగలేక శివకుమార్ కుటుంబసభ్యులు ఎల్‌బీనగర ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని ఆశ్రయించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి లక్ష రూపాయల ఎల్‌ఓసీ చెక్కును మంజూరు చేయించి ఆ చెక్కును శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపద సమయంలో పేదలకు సీఎం సహాయ నిధి వరంగా మారిందని అన్నారు. వైద్య ఖర్చులకు ఆర్థిక స్తోమత లేనివారు సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్యసేవలు అందించేందుకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు అనంతుల రాజిరెడ్డి, చెరకు ప్రశాంత్‌గౌడ్, చిరంజీవి, ఏర్పుల యాదయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని మాధవనగర్ కాలనీలో ప్రారంభించిన సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. సర్కిల్ ఏఈ సురేష్, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు హన్మంత్‌రెడ్డి, అనసూయ, కాలనీవాసులు బెనర్జీ, విజయసేనారెడ్డి, సత్తయ్య, శంభుప్రసాద్, ముత్యాలు, నరసింహ్మారెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాగోలు సీఐ సుధీర్‌కృష్ణకు శుభాకాంక్షలు



నాగోలు: నాగోల్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన సుధీర్ కృష్ణను శుక్రవారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్రా ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగోల్ డివిజన్‌లో అన్ని కాలనీలలో పెట్రోలింగ్‌ను పెంచాలని, డివిజన్‌లో చైన్ స్నాచింగ్‌లు అరికట్టాలని కోరారు. నాయకులు వస్పరి మల్లేష్, రావుల శ్రీనివాస్, నవీన్ , శివ పాల్గొన్నారు

విద్యారంగాన్ని విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



పోస్టర్ విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

మలక్‌పేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని పీడీఎస్‌యూ గ్రేటర్ హైద్రాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంద నవీన్, పాడపంగి నాగరాజు అన్నారు. ఈనెల 6 తేదీన సంగారెడ్డిలో నిర్వహించనున్న పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్‌లో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల విద్యార్థులకు విద్య అందకుండా విద్యరంగాన్ని ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన జాతీయ విద్యావిధానం–2020 తీసుకొచ్చి శ్రామిక వర్గాల పిల్లలను, పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర జరుగుతుందన్నారు. యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు, రమేష్, హర్ష, కిరణ్, సందీప్ , హరీష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

డీసీపీకి సన్మానం



డీసీపీ సుభాష్‌ను సన్మానిస్తున్న కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: సౌత్‌ఈస్ట్ జోన్ నూతన డీసీపీగా నియమితులైన పాటిల్ కాంతిలాల్ సుభాష్‌ను కాంగ్రెస్ నేతలు సన్మానించారు. శుక్రవారం టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులతో కలసి సైదాబాద్‌లోని కార్యాలయంలో డీసీపీని మర్యాదపూర్వకంగా కలసి ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కాంగ్రెస్ నాయకులు సహకరిస్తారని అన్నారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై పార్టీలకు అతీతంగా చర్యలు తీసుకోవాలని ఆయన డీసీపీని కోరారు. డీసీపీని సన్మానించిన వారిలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం కన్వీనర్ భువనగిరి చంద్రశేఖర్, యాకుత్‌పురా నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కోట్ల లడ్డూపటేల్, బన్నీ ఉన్నారు.

నేటి నుంచి వారాహి దేవి నవరాత్రులు



శ్రీ వారాహి దేవి నవరాత్రులకు అలంకరించబడిన ప్రత్యంగిరా దేవి ఆలయం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం ఆదిపరాశక్తి శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి మందిరంలో పీఠాధిపతులు జగద్గురువులు, శ్రీ సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి ఆశీస్సులతో శ్రీ వారాహిదేవి నవరాత్రులు నేటి నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మునిపల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ నవరాత్రులలో 9 రోజులు ఉదయం విశేష అభిషేకము, మహిళలచే కుంకుమార్చన, విశేష హోమము, విశేష అర్చనలు, పారాయణములు, మహా నక్షత్ర హారతుల సేవ జరుగుతాయని తెలిపారు. శ్రీ వారాహి దేవి గుప్త నవరాత్రులలో భక్తులందరూ అమ్మవారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం : సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజారుల్లో కూరగాయల ధరలు కిలోకు రూపాయల్లో ఈ విధంగా ఉన్నాయి. టమాట రూ.43, వంకాయ రూ. 35, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 70, కాకర రూ. 45, బీర రూ. 35, క్యాబేజి రూ. 23, ఫ్రెంచి బీన్స్ రూ. 105, క్యారెట్ రూ. 35, దొండ రూ. 18–20, చిక్కుడు రూ. 75, గోకర రూ. 50, బీట్‌రూట్ రూ. 25, క్యాప్సికం రూ. 70, ఆలు రూ. 37, దోస రూ.25, సొర రూ. 11, పొట్ల రూ. 18, ఉల్లిగడ్డ రూ. 38, చామగడ్డ రూ. 37 ఉండగా ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కాలుష్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



మన్సూరాబాద్: పర్యావరణ పరిరక్షణనే ధ్యేయంగా మొక్కలు నాటి కాలుష్య రహిత నవ సమాజాన్ని నిర్మిద్దామని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి పిలుపునిచ్చారు. డివిజన్ పరిధి సెంట్రల్ బ్యాంక్ కాలనీలోని కాకతీయ పాఠశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థులతో కలసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సమాజం పట్ల మనందరం బాధ్యతగా వ్యవహరించి పచ్చదనాన్ని కాపాడుతూ, సుస్థిర అభివృద్ధికి ఏకమవుదామని పేర్కొన్నారు. విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు బాటలు వేయాలని కోరారు. పాఠశాల విద్యార్థులు పర్యావరణంపై ర్యాలీలు చేసి కాలనీవాసులను అవగాహన కల్పించడడం అభినందనీమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పరిమళ, జోనల్ ఇన్‌చార్జి రమేష్‌చంద్ర, రాధా, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ముట్టడికి వెళ్తున్న నిరుద్యోగుల అరెస్టు

మలక్‌పేట: టీజీపీఎస్సీ ముట్టడికి తరలివెళ్తున్న నిరుద్యోగులను దిల్‌సుఖ్‌నగర్‌లో మలక్‌పేట పోలీసులు అడ్డుకున్నారు. దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్‌లో మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్యపురి నుంచి మూసారాంబాగ్ వైపు వాహనాలలో టీజీపీఎస్సీ ముట్టడికి తరలి వెళ్తున్న 10 మంది నిరుద్యోగులను అరెస్టు చేసి, సాయంత్రం సొంత పూచికత్తుపై విడుదల చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.